

టమాట కిలో రూ.8


అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం 6, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



సీమకు తీరని అన్యాయం

రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా చంద్రబాబు తీరని అన్యాయం చేస్తున్నారని సాగునీటి ఉద్యమ, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు.

8లో



న్యూస్‌రీల్

కనుల పండువగా పుష్పయాగోత్సవం

- ముగిసిన నృసింహుని బ్రహ్మోత్సవాలు



శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నారసింహుడు

కదిరి: పక్షం రోజుల పాటు సాగిన ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి పుష్పయాగోత్సవంతో ముగిశాయి. ఈ ఉత్సవం కనుల పండువగా, అత్యంత వైభవంగా సాగింది. శ్రీవారి బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా సాగేందుకు సహకరించిన అష్ట దిక్పాలకులు, పంచ భూతాలు, దేవతా మూర్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారిని.. వారి వారి లోకాలకు సాగనంపేందుకు నిర్వహించేదే ఈ పుష్ప యాగోత్సవమని ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు వివరించారు. తీర్థవాది ఉత్సవం ముగియగానే శనివారం సాయంత్రం నుంచి ఆలయం తలుపులు మూసి వేసిన విషయం తెలిసిందే. తిరిగి ఆదివారం వేకువ జామునే ఆలయ ద్వారాలు తెరిచి మహా సంప్రోక్షణ గావించారు. అనంతరం స్వామివారికి నిత్య పూజాది కైంకర్యాలను నిర్వహించిన మీదట భక్తులకు ఆలయంలో శ్రీవారి సర్వ దర్శన భాగ్యం కలిగించారు. రాత్రి రంగమండపంలో శ్రీదేవి, భూదేవిల సమేత శ్రీవారిని కర్ణాటక నుంచి తెప్పించిన పుష్పాలతో అలంకరించారు. ఉత్సవానికి ఉభయ దారులుగా రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పూల అశ్వర్థనారాయణ కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ సహాయ కమిషనర్ వెండిదండి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతులు



దిగుబడి లేని మొక్కజొన్న కంకులు

బ్రహ్మసముద్రం: నకిలీ విత్తనాలతో రైతులు మరోసారి దగాపడ్డారు. కర్ణాటక సరిహద్దు గ్రామాల రైతులను లక్ష్యంగా చేసుకుని రైతులను కంపెనీ ప్రతినిధులు నిట్టనిలువునా ముంచేశారు. బాధిత రైతులు తెలిపిన మేరకు.. తమ కంపెనీకి చెందిన మొక్కజొన్న విత్తన సీడ్స్‌ను సాగు చేస్తే అధిక లాభాలు అందజేస్తామని ఇటీవల ప్రముఖ లెవెన్ గ్రీన్ కావేరీ సీడ్స్ కంపెనీ ప్రతినిధులు బ్రహ్మసముద్రం మండలం మామడూరు గ్రామానికి చెందిన పలువురు రైతులను ఊరించారు. దీంతో ఒక్కో ఎకరాకు రూ.30 వేలు చొప్పున పెట్టుబడి పెట్టి పలువురు రైతులు 30 ఎకరాల్లో సదరు కంపెనీ విత్తనాలను సాగు చేశారు. తీరా పంట చేతికి వచ్చిన తర్వాత కోత కోసి చూస్తే అన్ని బోడికంకులే కావడంతో రైతుల ఆవేదన అంతా ఇంతా కాదు. ఇదే విషయాన్ని బాధిత రైతులు కంపెనీ ఏజెంట్లకు ఫోన్ చేసి తెలిపితే తమకు సంబంధం లేదని వారు చేతులెత్తేశారు. లెవెన్ గ్రీన్ కావేరి సీడ్స్ కంపెనీ ఏజెంట్లు తమను మోసం చేశారని, తమకు న్యాయం చేయాలంటూ రైతులు వేడుకుంటున్నారు.



శింగనమల మండలం ఉల్లికల్లు గ్రామానికి చెందిన రైతు పెద్ద చెవిరెడ్డి పొలంలో ఈదురుగాలులకు దెబ్బతిన్న మునగ చెట్లివి. నాలుగు సంవత్సరాల క్రితం చెవిరెడ్డి తన మూడెకరాల పొలంలో 210 మునగ చెట్లు నాటాడు. ప్రస్తుతం కాపు దశలో ఉన్నాయి. ఈ క్రమంలోనే శనివారం రాత్రి గాలీవానకు మునగ చెట్లన్నీ నేలకొరిగాయి. వేర్ల వరకూ లేచిపోయిన చెట్లను చూసి రైతు చెవిరెడ్డి, ఆయన కుటుంబీకులు బాధలో మునిగిపోయారు. దాదాపు రూ.4 లక్షల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆశలు గాలికి..

- అన్నదాతలను నిండాముంచిన ఈదురుగాలులు
- శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో తీవ్రంగా దెబ్బతిన్న పంటలు
- నేలకొరిగిన పంటలు చూసి తల్లడిల్లిపోతున్న రైతులు
- రూ.35.22 కోట్ల మేర నష్టం జరిగినట్లు అధికారుల అంచనా



పుట్లూరు మండలం మడ్డిపల్లి వద్ద బొప్పాయి తోటలో ఈదురుగాలులు సృష్టించిన బీభత్సం



శింగనమల మండలం ఉల్లికల్లులో విరిగిపోయిన దానిమ్మ చెట్లు



పుట్లూరు మండలం జంగంరెడ్డిపేటలో దెబ్బతిన్న అరటి తోటను చూపుతున్న రైతు మహేశ్వరరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్/శింగనమల/యల్లనూరు/పుట్లూరు: ఈదురుగాలులు ఉద్యాన రైతులకు శోకం మిగిల్చాయి. శనివారం సాయంత్రం గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లోని పుట్లూరు, యల్లనూరు, శింగనమల, పెద్దవడుగూరు, యాడికి తదితర మండలాల్లో పెద్ద ఎత్తున పంట నష్టం వాటిల్లింది.ఎల్లుట్ల, మడ్డిపల్లి, కుమ్మనమల, దోసలేడు, నిదనవాడ, దిమ్మగుడి చెర్లోపల్లి, ఎస్.కొత్తపల్లి, మేడికుర్తి, చింతకాయమండ, అరవేడు, వెన్నపూసపల్లి, నీర్జాంపల్లి, తిమ్మంపల్లి, కూచివారిపల్లి, కొడవాండ్లపల్లి, గొడ్డుమర్రి, శింగవరం, బొప్పేపల్లి, బుక్కాపురం, లక్ష్మంపల్లి, చందన తదితర గ్రామాల్లో 560 హెక్టార్లలో అరటి తోటలు నేలవాలాయి. శింగనమల మండలం ఉల్లికల్లు గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి తోటలో మామిడి కాయలు నేలరాలాయి. కృష్ణారెడ్డి, పరంధామ రెడ్డిల దానిమ్మ తోటల్లో చెట్లు నేలకొరిగాయి. లక్ష్మీనారాయణరెడ్డి, చిన్న శివారెడ్డి సాగు చేసిన మునగ పంటతో పాటు శ్రీనివాసులు రెడ్డికి చెందిన సపోట పంట తీవ్రంగా దెబ్బతింది. ఎల్లుట్లలో రైతు మారుతీనాయుడుకు చెందిన 1,000 అరటిచెట్లు విరిగిపోయాయి. 7 ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న పంట నేలవాలింది. దిగుబడి చేతికందే తరుణంలో ఇలా జరగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టామని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



మడ్డిపల్లి వద్ద నేలవాలిన మొక్కజొన్న పంట

రూ.35.22 కోట్ల నష్టం..

దెబ్బతిన్న పంట పొలాలను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు పరిశీలించారు. 406 మంది ఉద్యాన రైతులకు రూ.34.91 కోట్ల మేర పంట నష్టం వాటిల్లినట్లు నరసింహారావు తెలిపారు. అలాగే, 47 మందికి చెందిన 35 హెక్టార్ల మొక్కజొన్న దెబ్బతినడంతో రూ.31 లక్షల నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొన్నారు.

వర్ష సూచన..

కర్ణాటక నుంచి తమిళనాడు వరకు విస్తరించిన ఉపరితల ద్రోణి కారణంగా రాగల రెండు రోజులు జిల్లాలో అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి ఆదివారం విడుదల చేసిన బులెటిన్‌లో తెలిపారు. భారత వాతావరణ శాఖ అందించిన సమాచారం మేరకు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ ఎత్తులో విస్తరించిన ఉపరితల ద్రోణి వల్ల ఆంధ్రప్రదేశ్, యానాం ప్రాంతంలో నైరుతి, దక్షిణ దిశగా గాలులు వీస్తున్నట్లు తెలిపారు. దీంతో ఒకట్రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి తేలికపాటి వర్షం పడొచ్చన్నారు. 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీచే సూచన ఉందన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



గాలీవానకు తోటలో దానిమ్మ చెట్లు ఒరిగిపోయాయి. దాదాపు రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. మా గ్రామంలో చాలా మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి. లేకుంటే అన్నదాతలు అప్పుల పాలవడం ఖాయం. – పరంధామ రెడ్డి, ఉల్లికల్లు, శింగనమల మండలం

కాలవ ఇలాకాలో జోరుగా ఇసుక దందా



పోలీసులు పట్టుకోవడంతో రోడ్డుపక్కనే అన్‌లోడ్ చేసిన ఇసుక



పోలీసులు సీజ్ చేసిన ఇసుక టిప్పర్లు

- 6 ఇసుక టిప్పర్లను సీజ్ చేసిన పోలీసులు

కణేకల్లు: రాష్ట్ర ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఇలాకాలో టీడీపీ నేతలు బరి తెగించారు. పట్టపగలే ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. కణేకల్లు మండలంలోని రచ్చుమర్రి ఇసుక రీచ్ కేంద్రంగా వీరు సాగిస్తున్న దందా.. పోలీసుల దాడులతో బట్టబయలైంది. వివరాలు.. ఆదివారం రచ్చుమర్రి రీచ్ నుంచి టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే గ్రామస్తుల సమాచారంతో ఎస్‌ఐ నాగమధు సిబ్బందితో రీచ్ వద్దకు బయలుదేరారు. వీరికి కె.కొత్తపల్లి వద్ద టిప్పర్లు తారసపడ్డాయి. పోలీ సులు వాటిని నిలిపి తనిఖీ చేయగా.. పర్మిట్లు లేవని తెలిసింది. దీంతో పోలీసుస్టేషన్‌కు తరలించాలని డ్రైవర్లను ఎస్‌ఐ ఆదేశించారు. ఈ క్రమంలోనే రెండు వాహనాల డ్రైవర్లు తప్పించు కునేందుకు యత్నించగా పోలీసులు వెంబడించి ఒక టిప్పర్‌ను పట్టుకున్నారు. మొత్తం 6 టిప్పర్లను స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. రచ్చుమర్రి రీచ్‌లో ఇసుక కోసం మొత్తం 12 టిప్పర్లు వెళ్లగా.. పోలీసులు చేరుకొనే లోపే ఐదు టిప్పర్లు వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

టెండర్ గడువు ముగిసినా..

రచ్చుమర్రి రీచ్ నుంచి ఇసుక సరఫరా చేసేందుకు శ్రీహరి కన్‌స్ట్రక్షన్ అనే కంపెనీ దక్కించుకున్న టెండర్ ఈ నెల 13నే ముగిసింది. అయినా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగించారు. అయితే, పేరుకే శ్రీహరి కన్‌స్ట్రక్షన్ అయినా… తెర వెనుక టీడీపీ నేతల వ్యవహారంపై విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కణేకల్లుకు అయితే టిప్పర్ ఇసుక రూ. 6 వేలు, ఉరవకొండకు రూ. 9 వేలు, గుంతకల్లుకు రూ. 17 వేల నుంచి 18 వేల వరకు విక్రయించినట్లు సమాచారం. ఉచిత ఇసుక అంటూ సీఎం చంద్రబాబు, మంత్రి కొల్లు రవీంద్ర ఫొటోలున్న ఫ్లెక్సీలను టిప్పర్లకు కట్టి మరీ ఇసుకాసురులు దందా చేయడం చర్చనీయాంశంగా మారింది.

దందా సాగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు?



విలేకర్లతో మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: రచ్చుమర్రి రీచ్ నుంచి యథేచ్ఛగా ఇసుకను అక్రమంగా తరలిస్తుంటే అధికారులు చర్యలు తీసుకోకుండా ఏం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ప్రశ్నించారు. ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్న, కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డిలతో కలిసి కణేకల్లు పోలీసుస్టేషన్‌కు 'మెట్టు' వెళ్లారు. ఎఫ్‌ఐఆర్ కడుతున్నామని పోలీసులు సమాధానమివ్వడంపై ఆయన మండిపడ్డారు. ఉదయం 8 గంటలకు టిప్పర్లు పట్టుబడినా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ… టీడీపీ నేతల ఇసుక దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. ఇసుకాసురులను తప్పించాలని చూస్తే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు పైనేటి తిమ్మప్పచౌదరి, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు వేమన, మాజీ కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం అందించాలి

- మాజీ మంత్రి సాకే శైలజానాథ్



అనంతపురం కార్పొరేషన్: అకాల వర్షాలు, ఈదురు గాలులతో తీవ్రంగా నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ సాకే శైలజానాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. శింగనమల నియోజకవర్గంలోని పుట్లూరు, యల్లనూరు ప్రాంతాల్లో రైతులకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందన్నారు. పరిహారంతో పాటు మొక్కలను అందించేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలన్నారు. రైతాంగాన్ని నిర్లక్ష్యం చేస్తే ఏమాత్రం ఉపేక్షించేది లేదని, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు.



- భార్య, అత్తలు వేధిస్తున్నారంటూ రెండు రోజుల క్రితం అనంతపురం తపోవనం ప్రాంతానికి చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లోని తన ఇంట్లో ఉరి వేసుకుని తనువు చాలించాడు. ఇతడి భార్య 8 నెలల క్రితమే పండంటి పాపకు జన్మనివ్వడం గమనార్హం. తన సమస్యను ఏ ఒక్కరికి చెప్పి ఉన్నా యువకుడి జీవితం మరోలా ఉండేది.
- కదిరికి చెందిన 28 ఏళ్ల యువతి ఇటీవల భర్తతో విభేదించి ఉరి వేసుకుని బలవన్మరణం పొందింది. ఈమెకు ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు. చిన్న కారణాలకే భార్యాభర్తలు గొడవలు పడేవారని తెలిసింది… ఈ రెండు ఘటనలే కాదు.. ఇటీవలి కాలంలో దంపతుల ఆత్మహత్యలు పెరిగాయి.బిడ్డల గురించి ఆలోచించకుండా తనువులు చాలిస్తున్న అమ్మ, నాన్నలు.. పిల్లల్ని ఏకాకుల్ని చేస్తూ తీరని శోకం మిగులుస్తున్నారు.

ఆలోచించండి.. ఓ అమ్మానాన్న!

- చిన్న సమస్యలకే దూరం పెంచుకుంటున్న దంపతులు
- రోజు రోజుకూ పెరుగుతున్న బలవన్మరణాలు
- తనువు చాలించి పిల్లలను ఏకాకుల్ని చేస్తున్న వైనం
- కౌన్సెలింగ్‌తో 90 శాతం జంటల్లో సానుకూల మార్పులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సున్నితమైన అంశాలే భార్యాభర్తల మధ్య అగాథాలు సృష్టిస్తున్నాయి. గోటితో పోయేవి గొడ్డలి వరకూ వస్తున్నాయి. క్షణికావేశంలో వీరు తీసుకుంటున్న నిర్ణయాలు బిడ్డలకు శాపంగా పరిణమిస్తున్నాయి. మనసు విప్పి పది నిముషాలు కలిసి మాట్లాడుకుంటే పరిష్కారమయ్యే సమస్య అహంభావంతో ఇంకా జటిలమవుతోంది.

మరొకరికి చెప్పుకున్నా..

సమస్యలను ఎవరికీ చెప్పుకోక పోవడం, డాక్టరు వద్దకు వెళ్లాలంటే నామోషీగా భావిస్తుండటం వల్లే ఆత్మహత్యలు చోటుచేసుకుంటున్నాయని నిపుణులు చెబుతున్నారు. కొన్ని రకాల మానసిక రుగ్మతలే 'తీవ్ర' నిర్ణయానికి దారితీస్తున్నట్టు పేర్కొంటున్నారు. సమస్య తలెత్తినప్పుడు భార్యాభర్తలు కూర్చుని మాట్లాడుకుంటే అన్నీ సర్దుకుంటాయని సూచిస్తున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మానసిక రుగ్మతల బాధితులు

జబ్బు	బాధితుల శాతం
స్కిజో ఫినియా	19.93
మూడ్ డిజార్డర్స్	26.28
సబ్‌స్టాన్స్ డిజార్డర్	15.46
డిమెన్షియా	9.82
యాంగ్జైటీ-ఫోబిక్	24.53
చైల్డ్‌హుడ్ డిజార్డర్స్	3.98

కౌన్సెలింగ్‌తో పరిష్కారం



భార్యాభర్తల మధ్య అవగాహన లేకనే సమస్యలు తలెత్తుతున్నాయి. మా దగ్గరికి నెలకు 150 నుంచి 200 కేసులు వస్తున్నాయి. ప్రేమించే సమయంలో ఎక్కువ ప్రేమ చూపించారని ఇప్పుడు చూపించడం లేదని ఒకరు, తమను బయటకు తీసుకెళ్లడం లేదని, వివాహేతర సంబంధాలని ఇలా రకరకాల కేసులు ఉంటున్నాయి. మేం కేసులు కట్టేది 10 శాతం మాత్రమే. 90 శాతం కేసుల్ని కౌన్సెలింగ్ ద్వారానే పరిష్కరిస్తున్నాం. – మహబూబ్ బాషా, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ

ఇగోలు వీడాలి..



భార్యాభర్తల మధ్య కేవలం ఇగోల వల్లే సమస్యలు తలెత్తుతున్నాయి. దీన్ని ఒకరమైన మానసిక రుగ్మతగానే పరిగణించాలి. చావు దేనికీ పరిష్కారం కాదనే విషయం గ్రహించాలి. డాక్టరు వద్దకు రావడానికి నామోషీ అయితే.. బంధువులు, స్నేహితులు, సన్నిహితుల దగ్గరైనా సమస్య చెప్పుకుంటే పరిష్కారం లభిస్తుంది. – డా.ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్య నిపుణులు

సీమకు తీరని అన్యాయం

- అమరావతి ప్రయోజనమే రాష్ట్ర ప్రయోజనాలుగా భావిస్తున్న సీఎం చంద్రబాబు
- రాయలసీమ హక్కుల కోసం ఐక్య ఉద్యమాలు చేపట్టాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ, ప్రజా సంఘాల, సాగునీటి ఉద్యమ నాయకుల పిలుపు


ఐక్యతను చాటుతున్న సాగునీటి ఉద్యమ, రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు

అనంతపురం సెంట్రల్: రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా వెనుకబడిన ప్రాంతాలకు సీఎం చంద్రబాబు తీరని అన్యాయం చేస్తున్నారని సాగునీటి ఉద్యమ, రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు మండిపడ్డారు. అమరావతి ప్రయోజనమే రాష్ట్ర ప్రయోజనమనే విధంగా సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. వెనుకబడిన అనంతపురం జిల్లా ప్రయోజనాల కోసం ఐక్య ఉద్యమాలు చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైందని, ఇందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 'జిల్లా ప్రాజెక్టులు– విభజన హామీలు' అంశంపై అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న బీజీఆర్ ఫంక్షన్ హాల్‌లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ రమణ అధ్యక్షతన ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో పలువురు మేధావులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, సాగునీటి ఉద్యమ నాయకులు ఏమన్నారో... వారి మాటల్లోనే...

బాధాకరం



రాయలసీమకు నీళ్లు ఇవ్వాలని చెబుతూ పోలవరం, గోదావరి–బనకచర్ల ప్రాజెక్టులు చేపడుతుండడం బాధాకరం. ఈ ప్రాజెక్టులతో రాయలసీమ ప్రాంతానికి ఏ మాత్రం సంబంధం లేదు. తుంగభద్ర, హంద్రీ–నీవా ప్రాజెక్టులను బలోపేతం చేసుకోవాలి. హెచ్చెల్సీ వెడల్పు, హంద్రీ–నీవా కాలువను 10వేల క్యూసెక్కులకు వెడల్పు చేయాలి.
– మల్లికార్జున, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

పోరాటాల ద్వారానే సాధ్యం



రాయలసీమ ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో డాక్టర్ వైఎస్సార్ హంద్రీనీవా ప్రాజెక్ట్‌ను 90 శాతం పూర్తి చేశారు. ఆ లక్ష్యానికి రాష్ట్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. ఈ అంశంపై కేవలం సమావేశాలతో కాకుండా ప్రజల్లోకి వెళ్లి చైతన్యం తీసుకురావాలి. హంద్రీ–నీవా ప్రాజెక్ట్‌కు 40 టీఎంసీల నికర జలాలను కేటాయించేలా పోరాటాలు సాగించాలి.
– వై.మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ

గిట్టుబాటు ధర కల్పించాలి



పంటలకు గిట్టుబాటు ధర లేదు. కొద్దిరోజుల క్రితం టన్ను చీనీ రూ. 25వేల వరకూ ధర పలికితే ఈ రోజు రూ. 10వేలకు చేరుకుంది. మిరప రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలాంటి తరుణంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. పంటలను నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజ్ పాయింట్‌లను నిర్మించాలి.
– చంద్రశేఖరరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

సీమ హక్కుల పరిరక్షణకు ఉద్యమం



సీఎంగా వైఎస్ జగన్ కర్నూలును జ్యుడిషియల్ రాజధాని చేస్తే... ఇప్పుడు అమరావతికి తరలిస్తున్నారు. కడప నుంచి ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కూడా తరలిస్తున్నారు. సీమ ప్రాంతాల అభివృద్ధికి ఆటంకంగా మారిన తరలింపులను అడ్డుకుంటాం. రాయలసీమ హక్కులను కాపాడేందుకు ఉద్యమిస్తాం. – వెన్నపూస రవీంద్రారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం

శాశ్వత పరిష్కారం చూపాలి



నిత్య కరువు పీడిత ప్రాంతంగా ఉన్న అనంతను సస్యశ్యామలం చేసేందుకు శాశ్వత పరిష్కారం చూపాలి. హంద్రీ–నీవా లైనింగ్ పనులపై సర్వత్రా రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీనిపై జిల్లాలోని టీడీపీ ప్రజాప్రతినిధులు స్పందించాలి. రాజకీయాలు పక్కన పెట్టి జిల్లా ప్రయోజనాల కోసం కలిసికట్టుగా ఉద్యమించాలి.
– రమేష్ గౌడ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

రైతులకు తీరని నష్టం



జిల్లాలో మార్కెటింగ్ లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు . ఇటు హైదరాబాద్, అటు బెంగుళూరు లాంటి నగరాలకు వెళ్లి మార్కెటింగ్ చేసుకోలేకపోతున్నారు. ఈ సమస్యను అధిగమించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ధరల స్థిరీకరణ నిధి, పంటలకు ఇన్సూరెన్స్, కోల్డ్ స్టోరేజ్ పాయింట్‌లు, ప్రాసెసింగ్‌యూనిట్లు నిర్మించాలి.
– వంశీగోకుల్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ

రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టాలి



ఏటా 50 టీఎంసీల కృష్ణా వరద జలాలు వస్తే తప్ప కరువు ప్రాంతమైన అనంత బాగుపడదు. ఇందుకు సరిపడా రిజర్వాయర్ల నిర్మాణం జరిగేలా పోరాటాలు సాగించాలి. సీఎం చంద్రబాబుకు రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణాలు తప్ప ఈ ప్రాంత రైతుల గోడు పట్టడం లేదు.
– నారాయణ, రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక

హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేయాలి



హంద్రీ–నీవా ప్రాజెక్టుకు రోజూ ఓ టీఎంసీ నీటిని తీసుకువచ్చేలా కాలువ వెడల్పు జరిగితే తప్ప జిల్లాలో రైతాంగ మనుగడ సాగదు. కాలువకు లైనింగ్ పనులు చేయకూడదని జిల్లా ప్రజానీకం నినదిస్తుంటే టీడీపీ ప్రజాప్రతినిధులు లైనింగ్ పనులకు ప్రారంభోత్సవాలు చేయడం సిగ్గుచేటు. రాయలసీమ ప్రాజెక్టులు పూర్తి చేసేలా కలిసికట్టుగా ఉద్యమించాలి.
– రామ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి, జలసాధన కమిటీ

తీరని అన్యాయం



రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోంది. కర్నూలు నుంచి హైకోర్టును తరలించుకుపోతున్నా మాట్లాడేవాళ్లు లేరు. ఇప్పటికైనా ప్రజలు అప్రమత్తం కావాలి. హంద్రీ–నీవా కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ పనులు చేపడితే రైతులకు తీరని నష్టం కలుగుతుంది. కాబట్టి హంద్రీ–నీవా ద్వారా 65 టీఎంసీలు సాధించుకునే లక్ష్యంగా ఉద్యమాలు చేపట్టాలి. – వై. విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ఆ జీఓలను రద్దు చేయాలి



హంద్రీ–నీవా కాలువకు లైనింగ్ పనులు చేస్తే ఉమ్మడి జిల్లాకు శాశ్వతంగా అన్యాయం జరుగుతుంది. వెంటనే ఆ జీఓలను రద్దు చేయాలి. ఉమ్మడి జిల్లాలో పెనుకొండకు మంజూరైన మెడికల్ కాలేజీని పూర్తి చేయాలి. కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లో మెడికల్ కళాశాలలు నిర్మించాలి.
– ఆనంద రంగారెడ్డి, సాగునీటి ఉద్యమకారుడు, మడకశిర

క్లుప్తంగా

కాక రేపుతున్న 'కొల్లేరు'


ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

అనంతపురం: ఐపీఎల్ తరహాలో సాగుతున్న ఏపీ సూపర్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో కొల్లేరు క్లబ్ జట్టు కాకరేపుతోంది. రాష్ట్రంలో తొలిసారిగా ఏపీ సూపర్ కప్‌ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని అన్ని జిల్లాలను కలిపి 8 జోన్‌లుగా, 8 క్లబ్‌లుగా విభజించి నిర్వహిస్తున్న ఈ టోర్నీలో కొల్లేరు క్లబ్ జట్టులో ఏలూరు, తూర్పుగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు ఉన్న విషయం తెలిసిందే. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో సాగుతున్న ఈ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. అనంతపురంలోని ఆర్డీటీ క్రీడాగ్రామం వేదికగా సాగుతున్న ఈ టోర్నీలో భాగంగా ఇప్పటి వరకూ జరిగిన మ్యాచ్‌ల్లో అన్నింటా విజయం సాధించి కొల్లేరు క్లబ్ జట్టు 12 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. కాగా, టోర్నీలో భాగంగా ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో నల్లమల క్లబ్ జట్టుపై తలపడిన విశాఖ క్లబ్... 3–1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో తుంగభద్ర క్లబ్‌పై ఏకంగా ఐదు గోల్స్ సాధించి గోదావరి క్లబ్ జట్టు (5–0) విజయం కై వసం చేసుకుంది. కొల్లేరు –కోరమాండల్ క్లబ్ జట్ల మధ్య జరిగిన మూడో మ్యాచ్‌లో 2–0 గోల్స్ తేడాతో కొల్లేరు క్లబ్ విజయకేతనం ఎగురవేసింది.

ఆయుష్ జిల్లా కమిటీ ఎన్నిక


ఆయుష్ జిల్లా నూతన కమిటీ ఇదే

అనంతపురం మెడికల్: రాష్ట్రీయ ఆయుష్ మెడికల్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతపురంలోని గోకుల్ ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో ఆయుష్ దక్షిణాది రాష్ట్రాల కో ఆర్డినేటర్ డాక్టర్ వీరబోయిని నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోగుల కుమారయ్య, రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ శాంతిప్రియ, డాక్టర్ వీఎన్ రజితయాదవ్ ఆధ్వర్యంలో ఆయుష్ జిల్లా కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. జిల్లా కమిటీ గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ బి.కేదార్‌నాథ్, అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్.శ్రీనివాసనాయక్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్. చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎస్.గౌరీశంకర్, కోశాధికారిగా డాక్టర్ టి.మురళీకృష్ణ, సహాయ కార్యదర్శిగా డాక్టర్ బి.రఘుభూపాల్ రెడ్డి, డాక్టర్ టి.రియాజ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మల్లికార్జున గౌడ్, రామాంజినేయులు, ఎన్.షెక్షావలి, జీవీ నీలేష్, ఎస్.మహమ్మద్ రఫిక్, నరసింగరావు ఎన్నికయ్యారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ దివాకర్‌రావు


కేక్ కట్ చేస్తున్న డెఫ్ కమ్యూనిటీ మహిళ ఉద్యోగులు

అనంతపురం అర్బన్: శాఖా పరంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డెఫ్ కమ్యూనిటీ ఉమెన్ ఉద్యోగులకు ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ దివాకర్‌రావు భరోసానిచ్చారు. ఆదివారం అనంతపురంలోని కృష్ణకళామందిర్‌లో ఉమెన్ డెఫ్ ఎంపవర్మెంట్ ఆధ్వర్యంలో 9వ అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. డెఫ్ కమ్యూనిటీ ఉమెన్ టీమ్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమానికి దివాకర్‌రావుతో పాటు విశ్రాంత తహసీల్దారు పగడాల మల్లికార్జున ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కార్యాలయాల్లో అభద్రతాభావం లేకుండా పనిచేయాలన్నారు. ఉద్యోగపరంగా ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. వీరి ప్రసంగాన్ని డెఫ్ మహిళలకు ఇంటర్‌ప్రెటర్ యు.రామకృష్ణ సైగల ద్వారా వివరించారు. కార్యక్రమంలో డెఫ్ కమ్యూనిటీ టీమ్ హేమలత, మేరీఎవన్స్, రంగమ్మ, లావణ్య, మౌనిక, తిప్పమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాల వ్యవస్థ రద్దు చేసేలా సంస్కరణలు'


సమావేశంలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రాథమికోన్నత పాఠశాల వ్యవస్థను రద్దు చేసే దిశగా విద్యారంగ సంస్కరణలు ఉన్నాయని, ఫలితంగా విద్యకు బాలికలు దూరమవుతారని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతపురంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడారు. ప్రభుత్వ బడిని రక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు సమాజమూ తీసుకోవాలన్నారు. విద్యారంగ సంస్కరణల పేరుతో జీఓ 117 రద్దు చేసి ప్రత్యామ్నాయంగా మరో జీఓ తేవడానికి రాష్ట్రం ప్రభుత్వం శరవేగంగా పావులు కదుపుతోందన్నారు. ఈ సంస్కరణలతో 1, 2 తరగతులు మాత్రమే ఉన్న ఫౌండేషన్ పాఠశాలలు 20వేలకు పైగా పెరుగుతాయన్నారు. భవిష్యత్తులో ఈ పాఠశాలలు మూత పడతాయన్నారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల పేరుతో మిగిలిన ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను మ్యాపింగ్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పాఠశాలల విలీనానికి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ద్వారా బలవంతంగా తీర్మానాలు చేయించడం సరికాదన్నారు. పాఠశాలలను తగ్గించడం కాకుండా పిల్లల అభివృద్ధి కోణంలో సంస్కరణలు ఉండాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి గ్రామపంచాయతీలో మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేయాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియం, ప్లస్ టు పాఠశాలలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు రమణయ్య, సహాధ్యక్షులు రామప్ప, సరళ, జిల్లా కార్యదర్శులు సంజీవ్ కుమార్, శేఖర్, సుబ్బరాయుడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ పాల్గొన్నారు.

మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి


మాట్లాడుతున్న 'ఆపస్' రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకటసత్యనారాయణ

అనంతపురం ఎడ్యుకేషన్: పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలంటూ ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకటసత్యనారాయణ డిమాండ్ చేశారు. 'ఆపస్' కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వెంకటసత్యనారాయణ మాట్లాడుతూ... 2023లోనే వేతన సవరణ చేయాల్సి ఉన్నా నేటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు నగదు రూపంలో చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని దాదాపు 9 నెలలు వేచి ఉన్నా... కనీసం ఒక్క డీఏ కూడా ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వు 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వెంటనే అమలు చేయాలని, మోడల్ పాఠశాలల ఏర్పాటు ప్రక్రియ ప్రాథమిక పాఠశాల మూసివేతకు కారణం కాకూడదని, 2022 నుంచి చెల్లించాల్సిన జెడ్పీపీఎఫ్, జీపీఎఫ్, సరెండర్ లీవ్, సీపీఎస్‌కు సంబంధించిన 90 శాతం డీఏ అరియర్స్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో 'ఆపస్' రాష్ట్ర గౌరవ సలహాదారు వెంకటేశ్వర ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రాజేంద్రప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు హర్షవర్ధన్, పీఎస్వీ నాయుడు, జిల్లా కార్యదర్శి ఆదిశేషు, రమేష్, చిక్కీరప్ప, వరదరాజులు పాల్గొన్నారు.

దేశంలో మతోన్మాద పాలన


ప్రసంగిస్తున్న రామకృష్ణ


సభకు హాజరైన పార్టీ కార్యకర్తలు, ప్రజలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం

అనంతపురం అర్బన్: 'కేంద్రంలోని బీజేపీ కూటమి ప్రభుత్వం మతోన్మాద పాలన సాగిస్తోంది. దేశ సంపదను అదానీ, అంబానీలకు ధారాదత్తం చేస్తోంది' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్రస్థాయిలో విమర్శించారు. మోదీ పాలన వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త ప్రచార కార్యక్రమంలో భాగంగా సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలోని కేఎస్ఆర్ కళాశాల ఎదుట బహిరంగ సభ నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ అధ్యక్షతన జరిగిన సభకు రామకృష్ణతో పాటు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రామకృష్ణ మాట్లాడుతూ... దేశ స్వాతంత్రం కోసం పోరాడని బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేడు అధికారం చేపట్టి మతోన్మాద పాలన సాగిస్తున్నాయని మండిపడ్డారు. దేశం కోసం పోరాడిన మహాత్మా గాంధీని కించపరిచేలా... ఆయనను చంపిన గాడ్సేని గొప్పవాడిగా బీజేపీ చూస్తోందన్నారు. నాడు కాంగ్రెస్, కమ్యూనిస్టులు మాత్రమే దేశం కోసం పోరాటాలు సాగించారన్నారు. రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లోనే అవమానపరిచిన చరిత్ర బీజేపీదన్నారు. మతాలు, కులాల మధ్య చిచ్చు రగలిస్తున్నారన్నారు. బీజేపీ వల్ల దేశానికి పెను ప్రమాదం పొంచి ఉందనే విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. డీలిమిటేషన్ ద్వారా ఉత్తరాదిన సీట్లు పెంచుకుని తమ పార్టీ బలం పెంచుకునేందుకు బీజేపీ పెద్ద ఎత్తున కుట్ర చేస్తోందన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు జనాభాప్రాతిపదికన సీట్లు తగ్గించే కుటిలత్వాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. మతోన్మాద పాలన, దేశ ఆర్థికాన్ని కొల్లగొట్టే చర్యలకు వ్యతరేకంగా ఏప్రిల్ 14వ తేదీ వరకూ ప్రజా చైతన్య కార్యక్రమం తలపెట్టినట్లు వివరించారు. సభలో జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణ స్వామి, మల్లికార్జున, కార్యవర్గ సభ్యులు రాజారెడ్డి, కేశవరెడ్డి, శ్రీరాములు, పద్మావతి, సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగమంటూ ఘరానా మోసం

గార్లదిన్నె: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు... గార్లదిన్నె మండలం కనుంపల్లికి చెందిన మంజునాథ్‌రెడ్డి బీటెక్ పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. నిరుద్యోగిగా ఉన్న సమయంలో శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లికి చెందిన నరసింహులు అనే యువకుడితో పరిచయమైంది. ఆ సమయంలో నరసింహులు తాను తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కన్సల్టెన్సీ ఏజెన్సీలు నడుపుతున్నానని, బీటెక్ పూర్తి చేసిన వారికి ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తున్నట్లుగా నమ్మబలికాడు. రూ.6 లక్షలు చెల్లిస్తే మంచి ప్యాకేజీతో ఉన్నత శ్రేణి కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. అంత డబ్బు తన వద్ద లేకపోవడంతో మంజునాథరెడ్డి మిన్నకుండి పోయాడు. అయితే పదేపదే నరసింహులు కలసి హంగామా చేస్తుండడంతో అతని మాయలో మంజునాథరెడ్డి చిక్కుకున్నాడు. ఉద్యోగం వస్తుందన్న ఆశతో తన బంధువుల వద్ద రూ. 6 లక్షలు అప్పు చేసి 2024, జూన్‌లో విడతల వారీగా నరసింహులు ఫోన్ పే, బ్యాంక్ ఖాతాలకు బదిలీ చేశాడు. మంజునాథ్‌రెడ్డి ప్రయత్నాలను గమనించిన అనంతపురానికి చెందిన ఆయన స్నేహితుడు కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వస్తుందన్న ఆశతో నరసింహులకు రూ.6లక్షలు చెల్లించారు. నగదు బదలాయింపులు జరిగిన తర్వాత ఉద్యోగావకాశాలు కల్పించకపోవడంతో పలుమార్లు నరసింహులును అభ్యర్థిస్తూ వచ్చినా ఫలితం లేకపోయింది. ఉద్యోగం ఇప్పించలేక పోతే తమ డబ్బు వెనక్కు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. దీంతో నరసింహులు ముఖం చాటేశాడు. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో మంజునాథరెడ్డికి అనుమానం వచ్చి కొన్ని రోజుల క్రితం చెన్నేకొత్తపల్లికి వెళ్లి నరసింహులు కోసం ఆరా తీశాడు. అక్కడ ఆయన ఆచూకీ లభ్యం కాకపోవడంతో తాను మోసపోయినట్లుగా నిర్ధారించుకుని ఫిర్యాదు చేయడంతో గార్లదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి, నరసింహులు కోసం గాలింపు చేపట్టారు.

పాము పట్టబోతే కాటేసింది!


పట్టిన పామును చూపుతున్న సూర్యనారాయణ

తాడిపత్రి టౌన్: పామును పడుతూ ఓ యువకుడు కాటుకు గురయ్యాడు. వివరాలు.. తాడిపత్రిలోని స్పాట్‌లైన్ స్పోర్ట్స్ అకాడమీలో ఆదివారం విద్యార్థులు క్రికెట్ ఆడుతుండగా ఓ పామును గుర్తించి, అకాడమీ నిర్వాహకుడు నరేష్‌కు తెలిపారు. ఆయన ద్వారా సమాచారం అందుకున్న శ్రీనివాసపురానికి చెందిన పాములు పట్టే నిపుణుడు సూర్యనారాయణ అక్కడకు చేరుకుని పరిశీలించాడు. అప్పటికే బల్ల కిందకు చేరుకున్న పామును గుర్తించి పట్టుకోబోతుండగా అది కాటేసింది. అదే సమయంలో పామును ఒడిసిపట్టి సురక్షిత ప్రదేశంలో వదిలేశాడు. అనంతరం సూర్యనారాయణను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి అకాడమీ నిర్వాహకులు తీసుకెళ్లారు.

వ్యక్తి దుర్మరణం

తాడిపత్రి: మండలంలోని వెంకటరెడ్డిపల్లి బస్టాప్ వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల గ్రామానికి మురుగేష్ (56) వ్యక్తిగత పనిపై ఆదివారం తాడిపత్రికి వచ్చాడు. పని ముగించుకున్న అనంతరం మధ్యాహ్నం టీవీఎస్ మోపెడ్‌పై తిరుగు ప్రయాణమైన ఆయన వెంకటరెడ్డిపల్లి బస్టాప్ వద్దకు చేరుకోగానే బుగ్గ వైపు నుంచి బండల లోడ్‌తో వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఘటనలో తల ఛిద్రమై మురుగేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాడిపత్రి రూరల్ అప్‌గ్రేడ్ పీఎస్ సీఐ శివగంగాధరరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

17 మందిపై కేసు నమోదు

తాడిపత్రి టౌన్: ఈ నెల 21న తాడిపత్రిలో చోటు చేసుకున్న అల్లర్లకు సంబంధించి ఓ వర్గానికి చెందిన 17 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు సీఐ సాయిప్రసాద్ ఆదివారం వెల్లడించారు. కాగా, రంజాన్ వేళ స్థానిక వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకుడు ఫయాజ్‌బాషా ఈ నెల 21న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని జీర్ణించుకోలేక టీడీపీ నేత, మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పెద్దఎత్తున తన అనుచరులను ఉసిగొల్పి పోలీసుల సమక్షంలోనే ఫయాజ్ ఇంటిపై దాడి చేయించిన వైనం సంచలనం రేకెత్తించింది. ఆ సమయంలో టీడీపీ వర్గీయులు జరిపిన రాళ్ల దాడిలో అదే పార్టీకి చెందిన కార్యకర్త వరుణ్ గాయపడ్డాడు. దీంతో వరుణ్ ఫిర్యాదు ఆధారంగా వైఎస్సార్‌సీపీకి చెందిన 17 మంది కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేయడం గమనార్హం. టీడీపీ నేతల ఒత్తిళ్ల కారణంగా ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అగ్ని ప్రమాదంలో లారీ దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గార్లదిన్నె: మండలంలోని 44వ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి ఓ లారీ దగ్ధమైన ఘటన మరువక ముందే మరో లారీకి మంటలు వ్యాపించాయి. వివరాలు... ఈ నెల 20న రాజస్తాన్‌లోని కోటా నగరం నుంచి బెంగళూరుకు గోధుమల లోడుతో బయలుదేరిన లారీ ఆదివారం మధ్యాహ్నం గార్లదిన్నె మండలం తిమ్మంపేట గ్రామ సమీపంలోకి చేరుకోగానే 44వ జాతీయ రహదారి పక్కన వాహనాన్ని డ్రైవర్ ఆపి క్లీనర్‌తో కలసి కాసేపు విశ్రాంతి తీసుకున్నాడు. అదే సమయంలో లారీ ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్, క్లీనర్ మంటలు ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. ఘటనలో దాదాపు రూ.30 లక్షల విలువైన సరుకు కాలిబూడిదైనట్లు డ్రైవర్ తెలిపాడు. ఘటనపై ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తోటలో వ్యభిచారం

గార్లదిన్నె: మండల కేంద్రం సమీపంలోని ఓ తోటలో వ్యభిచారం సాగిస్తుండగా పోలీసులు అక్కడకు చేరుకుని ఓ యువతిని అదుపులోకి తీసుకున్నారు. వివరాలను గార్లదిన్నె పీఎస్ ఎస్ఐ గౌస్ మహమ్మద్‌బాషా వెల్లడించారు. గార్లదిన్నె మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రతి ఆదివారం ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు యువతులను రప్పించుకుని తోటలో గుట్టుగా వ్యభిచారం సాగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో నెల్లూరుకు చెందిన ఓ యువతి పట్టుబడింది. ఆమెను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రేషన్ బియ్యం స్వాధీనం

గార్లదిన్నె: మండలంలోని ముంటిముడుగులో ఆదివారం 32 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ ఈరమ్మ తెలిపారు. కల్లూరుకు చెందిన రమేష్ గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి ముంటిమడుగులోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేశాడన్నారు. ఈ నిల్వలను ఆదివారం కర్ణాటకకు తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టి స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మందకొడిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్

- ఆన్‌లైన్‌లో నమోదు కాని డీ పట్టా భూముల వివరాలు
- ముందుకు సాగని నమోదు ప్రక్రియ
- రెవెన్యూ, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ రైతన్నల ప్రదక్షిణలు
- పీఎం కిసాన్, పెట్టుబడి రాయితీలు అందవేమో అని ఆందోళన


కనగానపల్లిలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన రైతులు

కనగానపల్లి: ఆధార్ కార్డు మాదిరిగా రైతులకు విశిష్ట గుర్తింపు కార్డులను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం భూముల వివరాలను ఆన్‌లైన్‌లో (ఫార్మర్ రిజిస్ట్రేషన్) నమోదు చేయిస్తోంది. ఈ ప్రక్రియ వ్యవసాయశాఖ ద్వారా గత నెల రోజుల నుంచి జరుగుతోంది. ఇందులో భాగంగా రాప్తాడు నియోజకవర్గంలో అన్ని మండలాల్లో స్థానిక ఆర్‌ఎస్‌కేల వద్ద వ్యవసాయ సిబ్బంది రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అయితే వ్యవసాయ సాగు భూములు ఎక్కువగా ఉన్న కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రాప్తాడు, రామగిరి మండలాల్లో ఈ నమోదు ప్రక్రియ సాఫీగా సాగడం లేదు. ఈ మండలాల్లో సుమారు 65 వేల మంది రైతులు ఉండగా.. ఇప్పటి వరకు 60 శాతం మంది రైతుల పేర్లు కూడా నమోదు కాలేదని తెలుస్తోంది. ఇందుకు ప్రధాన కారణం ఈ ప్రాంతాల్లో రైతులు ఎక్కువగా డీ పట్టా భూములు కలిగి ఉన్నారు. ఈ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయలేదు. వ్యవసాయశాఖ వెబ్‌సైట్‌లో భూముల వివరాలు కనిపించడం లేదని ఆర్‌బీకే సిబ్బంది చెబుతున్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కాని రైతులు ఆర్‌ఎస్‌కేలు, మండల కేంద్రాల్లోని రెవెన్యూ, వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కనగానపల్లి మండలంలో సుమారు 16 వేల మంది రైతులు ఉండగా.. ఇప్పటి వరకు 10 వేల మంది రైతులు కూడా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని వ్యవసాయ సిబ్బంది చెబుతున్నారు. మండలంలోని కనగానపల్లి, కోనాపురం, దాదులూరు, ముక్తాపురం, తూంచర్ల, భానుకోట, కొండపల్లి గ్రామాల్లో చాలా మంది రైతులకు డీ పట్టా భూములు ఉన్నాయి. ఈ రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం ఆర్‌బీకేల వద్దకు వెళ్తే.. మీ భూముల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని అధికారులు సమాధానం ఇస్తున్నారు. మీ భూముల వివరాలను పట్టాదారు పాసు పుస్తకంలో కాలమ్–6 నందు నమోదు చేశారని చెబుతున్నారు. వీటిని సవరించడం ఇప్పుడే కాదని.. కొద్ది రోజులు వేచి ఉండాలంటూ అధికారులు సమాధానం ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విశిష్ట గుర్తింపు కార్డుతో ప్రయోజనాలు

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్, పెట్టుబడి రాయితీ, పంట నష్ట పరిహారాలు అందవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు గుర్తింపు కార్డు ఉంటేనే ప్రభుత్వం నుంచి పెట్టుబడి రాయితీలు, బీమా పరిహారాలు, బ్యాంకు రుణాలు అందుతాయని బయట బాగా ప్రచారం జరుగుతోంది. దీంతో భూముల ఆన్‌లైన్ సమస్యతో రిజిస్ట్రేషన్ చేయించుకోని రైతులు రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది చుట్టూ తిరుగుతున్నారు. అయితే అధికారులు మాత్రం ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం ఇంకా చాలా సమయం ఉందని చెబుతున్నారు. కాని గ్రామాల్లో రైతులు మాత్రం ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయినపుడు ప్రభుత్వం ఇచ్చే పరిహారాలు అందకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజులుగా తిరుగుతున్నా..



రైతు గుర్తింపు కార్డు (విశిష్ట సంఖ్య) కోసం పేరు నమోదు చేయించేందుకు కనగానపల్లిలోని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్దకు వెళ్లాను. ఆన్‌లైన్‌లో మా భూముల వివరాలు లేవని చెబుతున్నారు. వారం రోజుల నుంచి వ్యవసాయ, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుతున్నాను.. కాని ఎవరూ సరిగా చెప్పడం లేదు. గుర్తింపు సంఖ్య కోసం మా వివరాలు ఎప్పుడు నమోదు చేస్తారో తెలియడం లేదు.
– నారాణయణ, రైతు కనగానపల్లి మండలం

సమస్యలు పరిష్కరించాలి



గత 20 సంవత్సరాల నుంచి మా భూముల్లో పంటలు సాగు చేస్తున్నాం. అయితే రైతు గుర్తింపు కార్డు (విశిష్ట సంఖ్య) కోసం రైతు సేవా కేంద్రాలకు వెళ్తే భూముల వివరాలు ఆన్‌లైన్‌లో చూపించడం లేదని సమాధానం ఇస్తున్నారు. ఈ కార్డు రాకపోతే ప్రభుత్వం వచ్చే పరిహారాలు, రాయితీలు అందవని అధికారులు చెబుతున్నారు. అధికారులు సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి.
– ముత్యాలప్ప, కోనాపురం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

మండలంలోని అన్ని గ్రామాల్లో ఆర్‌ఎస్‌కేల వద్ద ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్నాం. కొన్ని గ్రామాల్లో రైతుల భూముల వివరాలు ఆన్‌లైన్‌లో చూపడం లేదని సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఫార్మర్ రిజిస్ట్రేషన్ మందకొడిగా సాగుతోంది. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడాం. రెవెన్యూ రికార్డుల్లో భూముల వివరాలు సక్రమంగా నమోదు చేస్తే ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి అవుతుంది.
– కృష్ణ కుమారి, మండల వ్యవసాయాధికారిణి, కనగానపల్లి

భగత్‌సింగ్ ఆశయసాధనకు కృషి


టవర్‌క్లాక్ వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు


ఆత్మకూరులో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న దృశ్యం


భగత్‌సింగ్ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న మాజీ సైనికులు


భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

అనంతపురం అర్బన్: స్వాతంత్య్ర సమరయోధుడు భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలు సాగించాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నగర పరిధిలోని వివిధ కాలనీల్లో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. స్థానిక టవర్‌క్లాక్ వద్ద జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వీరభద్రయ్య, సీపీఎం సీనియర్ నాయకుడు రాజమోహన్, నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడారు. బ్రిటిష్ సామ్రాజ్యానికి ఎదురు నిలిచిన యువ కెరటం భగత్‌సింగ్ అన్నారు. ఆయన ఆలోచనలు యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. దేశ స్వాతంత్య్రం కోసం చిన్న వయస్సులోనే భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లు తమ ప్రాణాలను అర్పించారని కొనియాడారు. వీరి ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ పోరాటాలు సాగించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాలరంగయ్య, ముత్తూజా, వెంకటనారాయణ, రామాంజి, ప్రకాష్, మసూద్, వలి, ఇర్ఫాన్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి సీపీఎం నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్, వెంకటమ్మ, కర్రెన్న, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధులకు నివాళి

అనంతపురం: స్వాతంత్య్ర సమరయోధులు భగత్ సింగ్, సుఖ్ దేవ్ సింగ్ థాపర్, రాజ్ గురుకు నివాళులర్పించేందుకు షహీద్ దివస్‌ను నిర్వహిస్తున్నట్లు మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న తెలిపారు. ఆదివారం మాజీ సైనికులు సమరయోధుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం కోశాధికారి తిమ్మారెడ్డి, ఈశ్వరయ్య, సంజీవ కుమార్, బీఏ హుస్సేన్, వై.ప్రసాద్, మహబూబ్ పీరా, పెంచలయ్య, శివ్ శంకర్, నబీ రసూల్, నాగరాజు, బాలా స్వామి, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

రాప్తాడురూరల్: భగత్ సింగ్ ఆశయాల సాధనకు పోరాడదామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య పిలుపునిచ్చారు. మన్నీల గ్రామం సమీపంలోని కృష్ణా గార్డెన్స్‌లో ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా కార్యాశాలలో (వర్క్‌షాప్) భాగంగా రెండో రోజు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేష్ గౌడ్ అధ్యక్షత వహించారు. భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇలాంటి సైద్ధాంతిక రాజకీయ శిక్షణ తరగతులు కార్మికులందరికీ దోహదపడతాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా కార్మిక సమస్యలు పూర్తిగా పక్కకు నెట్టిందని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి చలసాని రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జే రాజారెడ్డి, సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగ సుబ్బారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు వి.కృష్ణుడు, జి.చిరంజీవి, గోవిందు, సి.రాజు, రామకృష్ణ, అక్బర్ వలి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'మీ పాట–మీ ఇష్టం'


ఘంటసాల రామయ్యను సత్కరిస్తున్న గాయకులు

అనంతపురం కల్చరల్: ఘంటసాల ఆరాధన సమితి వ్యవస్థాపకుడు పాలసముద్రం నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం 'మీ పాట–మీ ఇష్టం' పేరిట సంగీత సత్సంగం నిర్వహించారు. స్థానిక మూడవ రోడ్డు ఘంటసాల భవన్ వేదికగా కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి గాయనీ గాయకులు విచ్చేశారు. ఆ పాత మధురాలతో శ్రోతలను ఆకట్టుకున్నారు. తొలుత పాలసముద్రం నాగరాజు భగవద్గీత శ్లోకాలు ఆలపించారు. అనంతరం శ్రీదేవి, పద్మజ, నవోమి, లక్ష్మీనారాయణ, రామాంజి, సుధాకరబాబు తదితరులు ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటలను పాడారు. అనంతరం నాలుగు దశాబ్దాలుగా అమరగాయకుడు ఘంటసాల ప్రచారానికే జీవితాన్ని అంకితం చేసిన జీవీ రామయ్యను సత్కరించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామికి అభిషేకాలు అనంతరం స్వామి వారి స్వర్ణముఖ కవచాన్ని మేళతాళాలతో ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు చేపట్టారు. అలాగే ఆలయంలో మంజునాథ స్వామి, పార్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళ హారతి అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు.

కనుల పండువగా రథోత్సవం


అలంకరణలో వేంకటేశ్వర స్వామి

యల్లనూరు: మండల కేంద్రంలో ఆదివారం లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో రథాన్ని ప్రారంభించారు. ఏడాదికోసారి నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా వెంకటేశ్వరస్వామి రథోత్సవాన్ని గ్రామస్తులు ఐకమత్యంగా నిర్వహించారు. ఓం నమో వెంకటేశాయ, గోవిందా గోవిందా, శ్రీ వెంకటేశా గోవింద అని భక్తుల నామస్మరణలతో పురవీధులు మార్మోగాయి. రథాన్ని లాగేందుకు గొలుసు కోసం భక్తులు, ప్రజలు ఎగబడ్డారు. ఎండలు మండిపోతున్నా, ఇలవేల్పును దర్శించుకొని రథంపైకి పుష్పాలు చల్లేందుకు మిద్దెలపైకి భక్తులు ఎక్కి స్వామి రథం మీదకు చల్లారు. రథోత్సవానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి, సర్పంచు పెద్ద ఓబులమ్మ, నాయకులు సుబ్బయ్య, కిరణ్ హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కోలాటం ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు ఆధ్వర్యంలో పుట్లూరు సీఐ సత్యబాబు, యల్లనూరు, పుట్లూరు ఎస్‌ఐలు రామాంజనేయరెడ్డి, నరసింహం, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


కోలాటం ఆడుతున్న భక్తులు

క్లుప్తంగా

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


పాటలు పాడుతున్న గాయకులు

అనంతపురం కల్చరల్: పద్మశ్రీ ఘంటసాల ట్రస్టు, పాతపాటల ప్రేమికుల బృందం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 'విరిసినదీ వసంతగానం' పేరుతో సంగీత కచేరీ నిర్వహించారు. ఆదివారం స్థానిక హౌసింగ్ బోర్డులోని ఘంటసాల స్మారక మందిర ప్రాంగణంలో జరిగిన సమావేశంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు గాయనీమణులను సత్కరించారు. నిర్వాహకులు ఓబుళదాసు, రామయ్య మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించడం హర్షణీయమన్నారు. కళారంగంలో అద్భుతాలు సృష్టిస్తున్నారని ప్రశంసించారు. అనంతరం శ్రీదేవి, బృంద, పద్మ తదితరులను ఘనంగా సత్కరించారు. అంతకు ముందు పలువురు ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి.

సంతల ఆదాయం రూ.4.61 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రికార్డు స్థాయిలో రూ.4.61 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ కె.గోవిందు తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత ద్వారా రూ.2,79,050 వసూలు కాగా.. ఆదివారం జరిగిన పశువులు, ఎద్దుల సంత ద్వారా రూ.1,82,090 మేర వసూలైనట్లు వెల్లడించారు.

విశ్వేశ్వర రావుకు సన్మానం


మాజీ సైనికుల సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ విశ్వేశ్వర రావును సన్మానించిన దృశ్యం

అనంతపురం: విజయవాడలో జరిగిన ఎన్నికల్లో మాజీ సైనికుల సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా పట్నం విశ్వేశ్వర రావు గెలుపొందినట్లు జిల్లా మాజీ సైనికులు జి.సుదర్శన్ రెడ్డి, రెడ్డివారి రమేష్ రెడ్డి, రమేష్ కుమార్ రెడ్డి, సురేంద్ర తెలిపారు. గతంలో ఈయన అనంతపురం జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడిగా పని చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్నం విశ్వేశ్వర రావును పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

ప్రజల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రం ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికే చలివేంద్రం ఏర్పాటు చేశామని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, పార్టీ మండల కన్వీనర్ సాకే వెంకటేష్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆదేశాలతో నాయకులు చియ్యేటి రామాంజనేయులు, చెడిపోతుల శ్రీనివాసులు, మంగళ శ్రీధర్, కురుబ రాజ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయన్నారు. బయటకు రావాలంటే భయమేస్తోందన్నారు. ప్రజల దాహార్తిని తీర్చడం కోసం స్థానిక వైఎస్సార్‌సీపీ యువ నాయకులు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, నాయకులు చింతకాయల జయన్న, సాకే చంద్ర, చిరుతల నాగేంద్ర, కుమ్మర రాము, ఎల్‌ఐసీ వెంకట్రాముడు, అరవ శ్రీకాంత్ రెడ్డి, బుడగ పెద్ద లింగమయ్య, మాజీ డీలర్లు లక్ష్మన్న, పాలవాయి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత ప్రచారం

రాప్తాడు/అనంతపురం కల్చరల్: ఉగాది పర్వదినం వెనుక పురాణాలు చెప్పే సూక్ష్మ విషయాలు ఎన్నో ఉన్నాయి. అందరూ తెలుసుకుని ఆచరించాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ప్రతినిధులు సూచించారు. ఆదివారం రాప్తాడు గ్రామంలో పలుచోట్ల త్రిమత గురువు శతాధిక గ్రంథకర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇందూ జ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాట్లాడుతూ.. రానున్న ఉగాది పర్వదినం గురించి ప్రస్తావిస్తూ షడ్రుచుల సమ్మేళనంగా సాగే ఉగాది ఆదివారం సృష్టితో ఏర్పడిందన్నారు. ఆది అంటే మొదలు కాబట్టి యుగ ఆదిగా స్థిరపడిందన్నారు. మనిషిలోని అరిషడ్వర్గాలకు ప్రతీకగా షడ్రుచులు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం భగవద్గీత పుస్తకాలను వితరణ చేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, చిరంజీవి, హరీష్, భాస్కరరెడ్డి, నాగేష్, లక్ష్మీదేవి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్

అనంతపురం కార్పొరేషన్: ఉగాది, రంజాన్ పండుగను పురస్కరించుకుని చంద్రయాన్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆజాద్‌నగర్‌లో ఉన్న నిరుపేదలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని మతాల సారాంశం ఒకటే అన్నారు. మానవ సేవే మాధవ సేవ అని.. పేదలకు సహాయం చేయాలనే ఉద్దేశంతో దుస్తులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో చంద్రయాన్ సేవా సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్, ఆదరణ సంస్థ నిర్వాహకుడు లాల్‌బాషా, ముస్లిం ఐక్య వేదిక నాయకులు నిజాం, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులు బహిష్కరించాలి

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్ విందులను బహిష్కరించాలని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టబోతున్న వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయాలని మౌలానా అర్షద్ మదని సాహెబ్ దామాత బర్కతహు పిలుపునిచ్చినట్లు గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనార్టీల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. రానున్న రోజుల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో బుద్ధి చెబుదామన్నారు.

దాన, ధర్మాలతో మోక్షం



రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేస్తున్న రషీద్ అహ్మద్ ట్రస్టు సభ్యులు

అనంతపురం కల్చరల్: పవిత్ర రంజాన్ మాసంలో చేసే దాన ధర్మాలతో మోక్షం పొందవచ్చని పలువురు మతపెద్దలు అన్నారు. ఆదివారం గుత్తి రోడ్డు సమీపంలోని అల్ అమీన్ చారిటబుల్ ట్రస్టు, రషీద్ అహ్మద్ మెమోరియల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో నిరుపేదలకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేశారు. ట్రస్టు ప్రతినిధులు ముర్షిదా బేగం, అర్షద్, ఆదాం, బాబా, ఖమర్‌తాజ్ తదితరులు మాట్లాడారు. రంజాన్ సందర్భంగా 1,000 మందికి రంజాన్ తోఫా కిట్లు అందజేయడం జరిగిందన్నారు. రంజాన్ దినాల్లో చేసే పుణ్యకార్యాలు అందరిలో మతసామరస్యాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కార్యక్రమంలో హఫీజ్, ఇమ్రాన్, జబ్బార్, ఇలియాజ్, అంజుమ్, కలీమ్ పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

చెన్నేకొత్తపల్లి: 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి, ఇంటర్‌మీడియట్‌లో ప్రవేశాలకు విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ సువర్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో కేవలం ఎంపీసీ గ్రూపు మాత్రమే ఉందన్నారు. ఏప్రిల్ 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.